క్లుప్తంగా

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



కె.జె.పురంలో కబడ్డీ ఆడుతున్న యువకులు

మాడుగుల రూరల్: మండలంలోని ఐదు సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. కె.జె.పురం, వీరనారాయణం తదితర గ్రామాల్లో నిర్వహించిన పోటీలను స్థానిక ఎంపీడీవో మీనాకుమారి పర్యవేక్షించారు.

చీడికాడలో..



చీడికాడ హై స్కూల్‌లో కబడ్డీ ఆడుతున్న యువకులు

చీడికాడ: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు సచివాలయాల పరిధిలో బుధవారం యువకులకు కబడ్డీ పోటీలు నిర్వహించినట్టు ఎంపీడీవో జయప్రకాష్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిని మండల స్థాయికి ఎంపిక చేసినట్టు ఆయన చెప్పారు.

దివ్యాంగుల సంఘ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సంఘ సభ్యులు

రావికమతం: దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడిగా గెంజి శ్రీనివాస్ బుధవారం ఎన్నికయ్యారు. ఆ సంఘం సర్వ సభ్య సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నికలు బుధవారం రావికమతంలో నిర్వహించారు. సంఘం నూతన అధ్యక్షుడిగా గెంజి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా వియ్యపు ముసిలినాయుడు, సలహాదారుడిగా అమరపల్లి నర్సింగరావుతో పాటు మరో ఆరుగురు సభ్యులను ఎన్నుకున్నారు.

నేటి నుంచి 'సదరం' స్లాట్ బుకింగ్

మాడుగుల రూరల్: దివ్యాంగులకు సదరం ధ్రువీకరణపత్రాలు జారీ కోసం ఈ నెల 4 వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ ప్రారంభమవుతుందని కె.జె.పురం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాదుపాత్రుడు బుధవారం తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి ప్రధాన ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించి, అనంతరం ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని చెప్పారు.

ఎ.కోడూరు ఎస్ఐగా రమేష్ బాధ్యతల స్వీకరణ



కె.కోటపాడు : ఎ.కోడూరు ఎస్ఐగా జె.రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా అనకాపల్లిలో ఎస్ఐగా పనిచేస్తున్న జె.రమేష్‌ను ఎ.కోడూరు పోలీస్‌స్టేషన్‌కు పంపారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన బి.రామకృష్ణ యలమంచిలి ట్రాఫిక్ ఎస్ఐగా బదిలీ అయ్యారు.

ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలి



ఓటర్లుకు అవగాహన కల్పిస్తున్న నాగలక్ష్మి

కె.కోటపాడు : ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆ హక్కును వినియోగించుకోవాలని మాడుగుల నియోజకవర్గ ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి అన్నారు. చౌడువాడలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఓటుహక్కును వినియోగించుకోవడాన్ని బాధ్యతగా గుర్తించాలని, ఓటు హక్కుతో శక్తివంతమైన ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోవడం సాధ్యమవుతుందన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులంతా ఓటర్లుగా నమోదు కావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ జానకి, పంచాయతీ కార్యదర్శులు ఎస్.రామునాయుడు, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం జగన్

• ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



లబ్ధిదారునికి పింఛన్ నగదు రూ.3వేలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



మాడుగులలో పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ రామధర్మజ



తామరంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైస్ ఎంపీపీ లక్ష్మి

రావికమతం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకుని, పింఛన్ కానుక మొత్తాన్ని రూ.3వేలకు పెంచి అవ్వాతాతలకు అండగా నిలిచారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. రూ.3వేల పింఛన్ నగదు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం రావికమతం మండల పరిషత్ కార్యక్రమంలో నిర్వహించారు. ఎంపీపీ పైల రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మాట ఇచ్చారంటే చేస్తారంతే అన్నట్టుగా జగన్‌మోహనరెడ్డి ప్రజల హృదయాలను మరోసారి గెలుచుకున్నారన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల కంటే చోడవరంలోనే అధికంగా 92 వేలమంది పింఛన్ లబ్ధిదారులున్నారని చెప్పారు. రావికమతం మండలంలో 12,472 మందికి రూ.3,70,97,000 పింఛన్ నగదు మంజూరైనట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ,ఎంపీటీసీ ఫ్లోర్‌లీడర్ పూడి దేవ, వైస్ ఎంపీపీలు మత్స భవానీ ప్రసాద్, దంట్ల వెంకట రమణ,ఎంపీడీవో వెంకన్న బాబు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల మంజూరు

నాతవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజకీయాలతో పనిలేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు మంజూరు చేస్తున్నట్టు ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తెలిపారు. మండల కేంద్రం నాతవరంలో బుధవారం ఏర్పాటు చేసిన పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాతవరం మండలంలో 2019 సంవత్సరానికి ముందు 9,710 మందికి పింఛన్లు ఇచ్చేవారన్నారు. మన ప్రభుత్వంలో మండలంలో 11,516 మందికి పింఛన్లు ఇస్తున్నామని, అదనంగా 2,273 మందికి పింఛన్లు ఇస్తున్న విషయాన్ని గమనించాలన్నారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పింఛన్ మొత్తాన్ని రూ.3,000 పెంచినట్టు చెప్పారు. కొత్తగా మండలానికి 132 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. గత ప్రభుత్వంలో పింఛను పొందాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరగవలసివచ్చేదని చెప్పారు. మళ్లీ సీఎంగా జగన్ మోహన్ రెడ్డిని గెలిపించుకుంటే రెట్టింపు సంక్షేమం పొందవచ్చన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక టీడీపీ నేతలు మతిభ్రమించో లేక మద్యం మత్తులో మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. నర్సీపట్నంలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రతో వైఎస్సార్ సీపీ క్యాడర్‌లో ఉత్సాహం మరింత పెరిగిందని, దీంతో టీడీపీ నాయకులకు భయం పట్టుకుందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున టీడీపీ నేతలు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని చెప్పారు. నియోజకవర్గంలో శాశ్వతంగా నిలిచిపోయే ఎన్నో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి జెడ్పీటీసీ సభ్యులు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీ పైల సునీల్, మైనం శ్రీనాగగోపి మండల ప్రత్యేకాధికారి జి.వి.లక్ష్మి, నాతవరం సర్పంచ్ గొలగాని రాణీ, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, నాతవరం 1,2 ఎంపీటీసీ సభ్యులు కరక రేణుక, చెక్కా ప్రభావతి, ఎంపీడీవో హనుమంతరావు, గన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొర్లె వరహాలబాబు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, జిల్లా కార్యదర్శి సబ్బవరపు వెంకునాయుడు పాల్గొన్నారు.

మాడుగులలో

మాడుగుల: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేసిన ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఎంపీపీ వేమవరపు రామధర్మజ అన్నారు. స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో బుధవారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో ఇంతవరకు అన్నిరకాలు పింఛన్లు 11, 949 ఉండగా తాజాగా 94 పింఛన్లు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, వైస్‌ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపసర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి,కుక్కర మహేశ్వరి, ఇన్‌చార్జి ఎంపీడీవో మీనా కుమారి తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైస్ ఎంపీపీ లక్ష్మి, తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు అన్నారు. వైఎస్సార్ పింఛను కానుక రూ.3,000కు పెంచిన సందర్భంగా తామరం సచివాలయంలో బుధవారం లబ్దిదారులతో కలసి సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని, దీనిని జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెల్లారత్నం, పీఏసీఎస్ డైరెక్టర్ ద్వారపు రెడ్డి అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

చాలా ఆనందంగా ఉంది



వయస్సు పైపడి పనికి వెళ్లలేని స్థితిలో ఉన్నాను. ఇప్పటి వరకూ రూ.2,750 పింఛన్ వచ్చేది. ఈరోజు రూ.3వేలు ఇచ్చారు. ఒకటో తేదీనే వలంటీర్ తలుపుతట్టి పింఛన్ ఇస్తుండడం చాలా ఆనందంగా ఉంది. మా ఆయుష్షుపోసుకుని జగన్‌బాబు నిండునూరేళ్లు చల్లగా ఉండాలి

– గొర్లె నూకాలమ్మ, గర్నికం, రావికమతం మండలం

ఇచ్చిన హామీ నెరవేర్చారు..



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ నెరవేరుస్తూ పింఛన్ నగదు మొత్తాన్ని పెంచారు. ఈరోజు వలంటీర్ వచ్చి రూ.3వేలు ఇచ్చాడు. మాకు ఆర్థికంగా ఇబ్బందిలేకుండా జగన్‌బాబు చూసుకోవడం చాలా ఆనందంగా ఉంది.

– గుమ్మాల అచ్చియ్యమ్మ, గర్నికం, రావికమతం.

అయోధ్యరాముని అక్షింతల పంపిణీ



మాడుగులలో ఇంటింటికీ అక్షింతలు అందజేస్తున్న ఎంపీపీ రామధర్మజ



కె.జె.పురంలో అక్షింతలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



ఎం. కోటపాడులో అక్షింతలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



దిబ్బపాలెంలో అక్షింతలను ఊరేగిస్తున్న మహిళలు



బోయిలకింతాడలో శోభాయాత్రలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు

మాడుగుల: అయోధ్య నుంచి వచ్చిన రాముని అక్షింతలను ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు ఆధ్వర్యంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజతో పాటు సంఘ సభ్యులు మాడుగులలో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ సంఘ సేవకుడు వి.శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ నెల 22న అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట ఉటుందని, ఆ తర్వాత ఈ అక్షింతలను శిరసున వేసుకుని ప్రతి ఒక్కరూ ఐదు ప్రమిదల్లో దీపారాధన చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపసర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనువాసరావు, పుట్టాబలరామ్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను బుధవారం పలు గ్రామాల్లో పంపిణీ చేశారు. ఎం.కోటపాడు, వల్లాపురం గ్రామాల్లో భజన బృందం సభ్యులు, గ్రామ ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేశారు. వీహెచ్‌పీ మండల ప్రముఖ్ రాపేట రామకొండలరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కేజే పురంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ జామి రమణబాబు, గ్రామ ప్రముఖ్ ఆడారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలను భక్తి శ్రద్ధలతో దిబ్బపాలెం గ్రామంలో బుధవారం ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని, స్వామి అక్షింతలను ప్రతి గడపలో అందజేశారు.

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడలో అయోధ్య రాముడి అక్షింతలతో బుధవారం రాత్రి ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. అక్షింతలతో కూడిన కలశాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ బూరె బాబూరావు తలపై పెట్టుకొని శోభాయాత్రలో పాల్గొన్నారు.

ఒత్తిడితో మానసిక సమస్యలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మానసిక వైద్య బృందం

చోడవరం రూరల్: విద్యార్థి దశలో తీవ్ర ఒత్తిడికి గురైనట్టయితే మానసిక సమస్యలకు దారితీస్తుందని సైకాలజిస్టు ఏ.మధులత అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల విద్యార్థులకు జిల్లా మానసిక ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో మానసిక వికాస సదస్సు నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మధులత మాట్లాడుతూ మనసును అదుపులో ఉంచుకుని, మంచి మార్గంలో నడచుకున్నప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకోగలమన్నారు. మానసిక ఆరోగ్య కార్యకర్త జి.సాయిలక్ష్మి, సమన్వయకర్త జి.సత్యనారాయణ, ఉపన్యాసకులు, ఎన్ఎస్ఎస్ పీవోలు పిచ్చమ్మ, రత్నభారతి, డి.మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

గబ్బాడ హైస్కూల్‌లో ట్యాబ్‌ల పంపిణీ



స్వాతికి నగదు ప్రోత్సాహం అందజేస్తున్న ఎంపీపీ రాజేశ్వరి

నర్సీపట్నం: గబ్బాడ హైస్కూల్‌లో బుధవారం ఎంపీపీ సుర్ల రాజేశ్వరి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను ఎనిమిదోవ తరగతి విద్యార్థులకు ఎంపీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకోని చదువులో రాణించి పాఠశాల పేరు నిలపాలన్నారు.

మెరిట్ విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు రిషీ జూనియర్ కళాశాల వారు నిర్వహించిన మెరిటోరియస్ స్కాలర్‌షిప్ టెస్ట్‌లో గబ్బాడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థి డి.స్వాతి ప్రథమస్థానంలో నిలిచింది.

ఎంపీపీ సుర్ల రాజేశ్వరి చేతుల మీదగా విద్యార్థిని స్వాతికి రూ.5 వేలు నగదు ప్రోత్సాహం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సిహెచ్.తలుపులు, హెచ్ఎం సత్యనారాయణ, రిషి కళాశాల కరస్పాండెంట్ కె.సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చోడవరం నియోజకవర్గంలోనే అత్యధిక పింఛన్లు



బుచ్చెయ్యపేటలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట : జిల్లాలోనే చోడవరం నియోజకవర్గంలో అత్యధికంగా పింఛన్లు మంజూరు చేయించి, లబ్ధిదారులకు అందించామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. బుధవారం బుచ్చెయ్యపేటలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో వెనకబడిన చోడవరం నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల్లో లబ్ధిదారులకు న్యాయం జరిగేలా ఎక్కువ పింఛన్లు మంజూరు చేయించినట్టు చెప్పారు. చోడవరం నియోజకవర్గంలో 46,282 మంది పింఛన్‌దార్లు ఉన్నారన్నారు. ఈ నెలలో కొత్తగా 532 మందికి పింఛన్లు మంజూరు చేయించామన్నారు. నియోజకవర్గంలో ఈ నాల్గున్నరేళ్ల కాలంలో రూ.1,882 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు నిర్వహించినట్టు చెప్పారు. టీడీపీ హయాంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీని రూ.170 కోట్ల నష్టాల్లోకి తీసికెళ్లగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన రూ.80 కోట్లు గ్రాంటుతో పాటు పంచదార అమ్మకాలతో మరో రూ.50 కోట్లతో అప్పు తీర్చామన్నారు. ఇంకా ఫ్యాక్టరీ రూ. 40 కోట్ల అప్పుల్లో ఉండగా ముఖ్యమంత్రి దృష్టికి తీసికెళ్లి నిధులు మంజూరుకు కృషి చేస్తున్నానని చెప్పారు. కొమ్మళ్లపూడి,వెంకన్న పాలెం వద్ద ఎస్ఈజెడ్‌లకు భూములు కేటాయించి ఈ ప్రాంత అభివృద్ధికి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకు సర్పంచ్‌లు,గ్రామ వలంటీర్లు,సచివాలయ కన్వీనర్లతో కలిసి ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తామన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో వైఎస్సార్ చేయూత నగదు పంపిణీ సమావేశం నిర్వహిస్తామని, 15న వలంటీర్లను సన్మానించి, సేవా అవార్డులను అందిస్తామన్నారు. ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరుతూ ప్రజల్లోకి వెళ్తామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జోగా కొండబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, నాయకులు సూర్య, మజ్జి సోమేష్,గొలజాన శ్రీను,చందు తదితర్లు పాల్గొన్నారు.


కానిస్టేబుల్‌గా ఎంపికైన వలంటీర్‌కు సత్కారం



కన్నారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్

నాతవరం: గ్రామ సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తూ సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగం పొందడం హర్షణీయమని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన గోమి కన్నారావు నాతవరం గ్రామ సచివాలయంలో వలంటీరుగా చేస్తూ ఇటీవల సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. దీంతో బుధవారం కన్నారావును ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ ఘనంగా సత్కరించారు, ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది నిరుద్యోగులు సచివాలయాల్లో ఉద్యోగాలు పొందడంతో పాటు, వలంటీర్లుగా పనిచేసే అవకాశం కలిగిందన్నారు. ఎంపీపీ సాగిన లక్ష్మణ మూర్తి, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగ గోపి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, నాతవ రం సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఎంపీటీసీలు కరక రేణుక చెక్కా ప్రభావతి, మండల ప్రత్యేకాధికారి జి.వి. లక్ష్మి, ఎంపీడీవో హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు



చవితిన బాబూరావును సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి నూతన కమిటీలన్నీ అంకిత భావంతో పనిచేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నూతన మండల కమిటీ ప్రతినిధులను ఆయన బుధవారం అభినందించారు. నూతన కమిటీలో ఉపాధ్యక్షుడిగా నియమితులైన చవితిన బాబూరావును సత్కరించారు.పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు ఎప్పుడూ వైఎస్సార్‌సీపీలో గుర్తింపు ఉంటుందని ధర్మశ్రీ చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నాగులాపల్లి రాంబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి దన్నిన వెంకటరావు, మండల కన్వీనర్ పతివాడ అప్పారావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో దుకాణాల నిర్వహణపై విచారణ



విచారణ చేస్తున్న అసిస్టెంట్ మేనేజర్‌నాయుడు

రావికమతం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో దుకాణాలు నిర్వహిస్తున్న తీరు, అక్కడి యజమానులెవరన్నదానిపై నర్సీపట్నం డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎస్.ఎస్. నాయుడు బుధవారం విచారణ చేశారు. ప్రయాణికులు ఎవరూ రావడం లేదన్న కారణంతో ఆర్టీసీ కాంప్లెక్స్ భవనాన్ని రావికమతంలో కోకాకోలా వ్యాపారికి పదేళ్ల కిందట అద్దెకిచ్చారు. అయితే లీజు అగ్రిమెంట్ ఉల్లంఘించారని, వేరే వ్యాపారులు దుకాణాలు నిర్వహిస్తున్నారనే ఫిర్యాదు మేరకు నాయుడు బుధవారం రావికమతం వచ్చి ఆ స్థలంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి వివరాలు,అసలైన అగ్రిమెంట్ దారుడు ఎవరన్న దానిపై ఆరా తీశారు. నివేదికను డిపోమేనేజర్‌కు అందించి, తగిన చర్యలు చేపడతామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

ఘనంగా సావిత్రిబాయిపూలే జయంతి



మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం



మాకవరపాలెంలో నివాళులర్పిస్తున్న ఎంఈవో మూర్తి



గవరవరంలో సావిత్రిబాయిపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

రోలుగుంట : మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి ని స్థానిక హైస్కూల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో సన్మానించారు. సావిత్రిబాయి పూలే ఔన్నత్యాన్ని హెచ్ఎం ప్రసాద్ విద్యార్థులకు వివరించారు.

మాకవరపాలెం: సావిత్రిబాయిపూలే జయంతిని స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయిపూలే చిత్రపటానికి ఎంఈవో మూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయిని వెంకటలక్ష్మిని సత్కరించారు. హెచ్ఎం లచ్చాపాత్రుడు పాల్గొన్నారు.

చోడవరం రూరల్: గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయిపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి హెచ్ఎం జి.జె. సుందర్‌సింగ్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ఎ.ఎస్.కృప, డి.వి.వి.రమణి, ఎ.వి.ఎన్.ఎస్. మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష.. ప్రజారోగ్యానికి రక్ష



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న బోడపాటి సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజారోగ్యానికి శ్రీరామ రక్షగా నిలుస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి తెలిపారు. మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి 1వ సచివాలయంలో నిర్వహించిన రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలోవిప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ఈ శిబిరంలో వినీషా మాధుర్య, టి.పాపపద్మని, పి.అదిత్య వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ తమరాన అప్పలనాయుడు, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, మేనేజర్ శంకరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

5నుంచి రెండవ విడత 'జగనన్న ఆరోగ్య సురక్ష'

గొలుగొండ: మండలంలోని 27 పంచాయతీ కేంద్రాల్లో ఈనెల 5 నుంచి రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైద్యాధికారి శ్యాంమ్‌కుమార్ తెలిపారు. 5న పుత్తడిగైరంపేట గ్రామంలో ప్రారంభించనున్నట్టు చెప్పారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నర్సీపట్నం: ఎంజేపీ గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు నక్కపల్లి హెటిరో ఔషధ పరిశ్రమ యాజమాన్యం స్టడీ మెటీరియల్ సమకూర్చింది. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి ఆ స్టడీ మెటీరియల్‌ను బుధవారం విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు దవరసింగి రాంబాబు, తోట రాజుబాబు ఉపాధ్యాయులు రజని, పద్మావతి, లక్ష్మి, శ్రీదేవి, సుబ్బారావు, సత్యనారాయణ, సత్తిబాబు, పీఈటీ రమేష్, స్టాఫ్ నర్స్ ప్రసన్న పాల్గొన్నారు.

కేజీబీవీకి ఇన్వర్టర్ వితరణ



ఇన్వర్టర్‌ను అందజేస్తున్న అప్పలస్వామి

మాకవరపాలెం: విద్యుత్ లేని సమయంలో ఇబ్బందులు లేకుండా కస్తూర్బా పాఠశాలకు నర్సీపట్నానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు అప్పలస్వామి, శ్రీకాకుళంలో పనిచేస్తున్న వైద్యురాలు హర్షవల్లి ఇన్వర్టర్‌ను సమకూర్చారు. దీనిని బుధవారం పాఠశాల ఎస్‌వో త్రివేణి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బాబ్జీకి అందజేశారు.